జగన్ పాలనలో గాంధీజీ కలలు సాకారం

- ఆచరణలోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు
- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ముక్కామలలో పలు అభివృద్ధి పనులు



ముక్కామల హైస్కూల్లో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఆచరణలోకి తెచ్చిందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని ముక్కామల పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం–2 నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ గ్రామంలోని రజక వృత్తిదారుల కోసం రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే దోబీ ఘాట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన ట్యాబ్‌లను ముక్కామల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ముక్కామల, పిట్టల వేమవరం, మల్లేశ్వరం ఉన్నత పాఠశాలలకు చెందిన మొత్తం 165 మంది విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు అందజేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి ఫొటో దిగారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 33 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1,973 మంది 8వ తరగతి చదువుతున్నారన్నారు. వారందరితో పాటు, పాఠాలు బోధించే ఉపాధ్యాయులను కలిపి మొత్తం 2245 ట్యాబ్‌లు అందిస్తున్నామన్నారు. ఒక్క పెరవలి మండలంలో 619 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తున్నామని వివరించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

జల్‌జీవన్ మిషన్ కింద రూ.72 కోట్ల వ్యయంతో నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. ప్రతి గ్రామంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నామని, ఇంటింటికీ ఉచిత తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఇప్పటి వరకూ ముక్కామల పంచాయతీ పరిధిలో రూ.25.45 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే ఈ పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా రూ.30.69 కోట్ల మేర లబ్ధి చేకూర్చామన్నారు. నియోజకవర్గంలో నాడు–నేడు, రోడ్లు, భవనాలు, కమ్యూనిటీ హాల్స్, డ్రెయిన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు రూ.670 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. వైఎస్సార్ సీపీ పాలనకు పూర్తి భిన్నంగా గత టీడీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో పాటు ఆ పార్టీ నాయకులు మాఫియాగా తయారై మట్టి, ఇసుక అమ్ముకుని, జేబులు నింపుకున్నారని శ్రీనివాస్‌నాయుడు విమర్శించారు. పేదలకు సెంటు ఇంటి స్థలం కూడా ఇవ్వని ప్రభుత్వం తెలుగుదేశం అని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ముక్కామలలో దోబీఘాట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు రేలంగి ఏసు, వివిధ పంచాయతీల సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ



దొమ్మేరులో రైతులకు ఉచితంగా ఎలుకల నిర్మూలన మందు అందజేస్తున్న ఏడీఏ చంద్రశేఖర్

కొవ్వూరు: సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా మండలంలోని దొమ్మేరు రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు బుధవారం ఎలుకల నివారణ మందును వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. బ్రోమోడయెలిన్ 0.25 శాతం ఎరను 10 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో ఉంచాలని ఆయన సూచించారు. ఈ మందు తిన్న ఎలుకలు నాలుగు రోజుల తర్వాత రక్త స్రావమై చనిపోతాయని వివరించారు. ఎలుకల నిర్మూలన మందు మండలంలోని అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉందని ఏవో ఎ.గంగాధరరావు సూచించారు.

అంతర్ జిల్లాల సరిహద్దులో చెక్ పోస్టు



జగన్నాథపురం వద్ద అంతర్ జిల్లా సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గోపాలపురం: అంతర్ జిల్లాల సరిహద్దుల్లో పోలీసు చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్టు స్థానిక ఎస్సై కె సతీష్‌కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా సరిహద్దు జగన్నాథపురం వద్ద బుధవారం చెక్ పోస్టు ఏర్పాటు చేసి, వాహనాలను తనిఖీ చేశారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్టు ఎస్సై చెప్పారు. వాహనాల్లో మాదక ద్రవ్యాలు, నగదు తరలించరాదన్నారు. ఒక వేళ తరలిస్తే నగదుకు సంబంధించిన పత్రాలు విధిగా వాహనదారుని దగ్గర ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఏఎస్సైలు యెగ్గేపల్లి సత్యనారాయణ, కె శోభనాద్రి పాల్గొన్నారు.

'సురక్ష ' శిబిరంలో 410 మందికి వైద్యం

నిడదవోలు: స్థానిక రామ్‌నగర్ సచివాలయం వద్ద బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అవసరమైన వారికి ఉచితంగా మందుల కిట్లు పంపిణీ చేశారు. నెహ్రూనగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి తేజశ్రీ నేతృత్వంలో ప్రత్యేక వైద్యుల బృందం వివిధ విభాగాల్లో 410 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే శిబిరంలో 36 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి తేజశ్రీ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు ఎండీ షకీరాబేగం, ఆలమూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ఐక్యంగా పని చేయాలి

ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి
ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి పాటు పడాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఉండ్రాజవరం మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పలు గ్రామాలకు విద్యుత్ లైన్‌మెన్ల కొరత ఉందంటూ ట్రాన్స్‌కో ఏఈ దొరబాబు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య మాట్లాడుతూ ప్రతి మండల సమావేశంలో ఇద్దరు, ముగ్గురు సభ్యులే ప్రతి విషయాన్నీ మాట్లాడుతున్నారన్నారు. మిగిలిన సభ్యులు కూడా మాట్లాడడానికి అవకాశం కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన నాడు–నేడు పనులు చివరి దశకు చేరుకున్నాయని ఎంఈవో సక్సేనా రాజు చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ట్రాన్స్‌కో ఏఈ దొరబాబు తమ శాఖలపై మాట్లాడారు. సమావేశానికి హాజరైన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో జీఆర్‌కే రాజు, తహసీల్దార్ జి.కనకరాజు, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు సమాయత్తం కండి

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు సూచన
- మండలాల వారీగా కొవ్వూరులో సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు

కొవ్వూరు: ఫిబ్రవరి మూడో తేదీన ఏలూరు సమీపంలోని దెందులూరులో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం'బహిరంగ సభ విజయవంతానికి వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ శ్రేణులంతా సిద్ధం కావాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన సిద్ధం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయం పరిధి నుంచి పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలన్నారు. సభకు వచ్చే పార్టీ శ్రేణులకు ఇబ్బందులు కలగకుండా నాయకులు ముందు నుంచీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం నాయకులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాలు, పురపాలక సంఘం నాయకులతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విడివిడిగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. సభకు సన్నాహాలపై గ్రామాల వారీగా పలువురు నాయకులకు ఆయన బాధ్యతలు అప్పగించారు. వాహనాల్లో ప్రయాణించే పార్టీ శ్రేణులకు అవసరమైన ఆహారం, తాగునీరు వంటివి ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి మండలంలోనూ పార్టీ ఆయా మండల శాఖల అధ్యక్షుల ఆధ్వర్యంలో సమన్వయంతో ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీలు మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, పార్టీ మండల శాఖల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సమీక్షలు

'సాక్షి' తో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



తానేటి వనిత

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పేర్కొన్నారు. యర్నగూడెంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ప్రధానంగా నాలుగు మండలాల్లోనూ విద్యుత్తు, రోడ్లు, శిథిలమైన వ్యాటర్ ట్యాంక్‌లు, ఇళ్ల స్థలాలు, సొంత స్థలాలు గల లబ్ధిదారులకు గృహాలు మంజూరు కాని విషయాలు తన దృష్టికి వచ్చాయన్నారు. అలాగే జలజీవన్ మిషన్ వంటి పనులు అసంతృప్తిగా ఉండడం, జగనన్న లేఅవుట్‌లో కొరవడిన మౌలిక వసతులు వంటి సమస్యలను కూడా మండలాల వారీగా సమీక్షల్లో ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకు వచ్చారని వివరించారు. వాటిపై శాఖల వారీగా అధికారులతో సమీక్షలు నిర్వహించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చానన్నారు. త్వరలోనే తాను గ్రామాల పర్యటనకు వస్తానని అప్పటికి, సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి వనిత చెప్పారు. పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గోపాలపురం–దొండపూడి రోడ్డు అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల రూ.45 కోట్లు మంజూరు చేయగా కాంట్రాక్టర్ జాప్యం వలన పనులు ప్రారంభం కాలేదన్నారు. తాను కాంట్రాక్టర్‌ను పిలిపించి రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. పదేళ్లుగా యర్నగూడెం– త్యాజంపూడి ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి అన్నారు. ఈ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.72 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సొంత స్థలాలు కలిగి ఉండి గృహాలు మంజూరు కాక ప్రజలు ఎదురు చూస్తున్నారని ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. న్యాయస్థానాల్లో భూ వివాదాలున్నందున్న నలజర్లలో దాదాపు 300 మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని ఆమె అన్నారు. అలాగే కొన్ని చోట్ల జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించాల్సి ఉందన్నారు. పలు గ్రామాల్లో ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్లడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం లైన్లు తొలగించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. నిధులు మంజూరు కావడంతో దూబచర్ల –ద్వారకా తిరుమల రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ స్వర్ణ శ్రీనివాస్ నాయక్

కొవ్వూరు: లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) బి.స్వర్ణ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన పట్టణంలోని భాష్యం స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ బైక్ నడిపేటపుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రయాణంలో తీసుకోవాల్సిన ట్రాఫిక్ నిబంధనల గురించి ఆయన వివరించారు. కొత్తగా లైసెన్స్ ఎల్‌ఎల్‌ఆర్ తీసుకున్నవారు కచ్చితంగా పేరెంట్, ఇతర లైసెన్స్ కలిగిన వారి తోడ్పాటులో మాత్రమే వాహనాన్ని నడపాలన్నారు. అసిస్టెంట్ ఎంవీఐ ఎండీ జమీర్, ఆ స్కూల్ ప్రిన్సిపాల్ బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసిన వారిని మరచిపోవద్దు

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



అన్నపూర్ణ నగర్‌లో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: మీకు మంచి చేసిన వారిని మరచిపోవద్దని, మళ్లీ మళ్లీ మంచి కావాలనుకుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని 2వ వార్డు అన్నపూర్ణ నగర్‌లో బుధవారం రాత్రి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, పలువురు కౌన్సిలర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు అందుతున్న సంక్షేమ పథకాలపై వార్డు వాసులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, రైల్వే గేట్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మించాలని పలువురు మహిళలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎగుమతికి వీలైన పొగాకు పండించండి

- రైతులకు పొగాకు బోర్డు ఆర్‌ఎం ఆదిశేషయ్య సూచన
- శాస్త్రవేత్తలు, అధికారులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులతో కలసి తోటల పరిశీలన



క్యూరింగ్ చేసిన పొగాకును పరిశీలిస్తున్న బోర్డు అధికారులు, కొనుగోలు సంస్థల ప్రతినిధులు

దేవరపల్లి: ఎగుమతులకు అనువైన పొగాకును ఉత్పత్తి చేసి గిట్టుబాటు ధర పొందాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఎం.ఆది శేషయ్య రైతులకు సూచించారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని రామన్నపాలెం, కొత్తగూడెం, ధుమంతునిగూడెం, బందపురం, దుద్దుకూరు, చెరుకుమిల్లి గ్రామాల్లో సాగులో ఉన్న పొగాకు తోటలను బుధవారం ఆయన బోర్డు అధికారులు, శాస్త్రవేత్తలు, కొనుగోలు సంస్థల ప్రతినిధుల బృందంతో కలసి పరిశీలించారు. పొగాకు పంటలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, క్యూరింగ్, గ్రేడింగ్, అన్య పదార్థాలు, క్రిమిసంహారక మందుల అవశేషాల వల్ల మార్కెటింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ సుస్థిర సాగు విధానాలు అవలంభిస్తూ క్యూరింగ్, గ్రేడింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రసాయన అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు పండించాలని రైతులకు సూచించారు. అవసరాలకు అనుగుణంగా పొగాకు తోటలకు సిఫార్సు చేసిన రసాయనాలను మాత్రమే తగు మోతాదులో వాడాలన్నారు. పొగాకు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పండుగల్ల పొగాకును రైతులు బయట అమ్మవద్దని, వేలం కేంద్రంలోనే విక్రయించాలన్నారు. పొగాకు తోటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయని, సకాలంలో మొక్క పిలకలను నివారించడం వల్ల అదనంగా 10 శాతం దిగుబడి పొందవచ్చన్నారు. తోటల్లో పొటాషియం లోపం కనిపిస్తే పొటాషియం నైట్రేట్‌ను ద్రవ రూపంలో మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త వై.సుబ్బయ్య, పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి వై.శ్రీధర్‌రెడ్డి, సీనియర్ గ్రేడింగ్ అధికారి వి.శివకుమార్, వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పథకాల కేటాయింపులో సమతుల్యత పాటించాలి

- ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు
- తాళ్లపూడి మండల పరిషత్ సమావేశం




మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పోశిరాజు

తాళ్లపూడి: అభివృద్ధి పథకాలు అమలు చేసేటపుడు అధికారులు ప్రొటోకాల్ పాటించాలని, అలాగే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణ సమావేశాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోశిరాజు వివిధ శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజర్ కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో మమ్మీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జాన్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు తమ శాఖల పనితీరు గురించి సభ్యులకు వివరించారు. పెద్దేవం ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు మాట్లాడుతూ అధికారులు గ్రామంలో ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. తమ గ్రామంలో దోమలు ఎక్కువగా ఉన్నా ఫాగింగ్ చేయడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు మాట్లాడుతూ 90 రోజుల పథకంలో మండలానికి మంజూరైన 80 ఇళ్ల స్థలాలనూ ఒక్క అన్నదేవరపేట పంచాయతీకే కేటాయించడం తగదన్నారు. మిగిలిన పంచాయతీలకు ఎందుకు కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. ఎంపీపీ పోశిరాజు స్పందిస్తూ దోమల వ్యాప్తిపై నివారణపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. పేదల ఇళ్ల స్థలాలపై దృష్టి సారిస్తామన్నారు. సమావేశంలో ఆర్ఐ కిషోర్, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, పలువురు మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే వెంకట్రావు సూచన



చాగల్లు పరిచయ సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున నాయకులందరూ సమన్వయంతో వైస్సార్ సీపీ విజయానికి పని చేయాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో పరిచయ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని కాపవరం గ్రామంలో పర్యటించారు. అక్కడి వైఎస్సార్ విగ్రహానికి తొలుత తలారి పూలమాల వేసి నివాళి అర్పించారు. వ్యక్తిగతంగా పార్టీ స్థానిక నాయకులను పరిచయం చేసుకున్నారు. కాపవరం సచివాలయానికి వెళ్లిన ఆయనకి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ సుంకర పద్మని, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ మాదార్ ఉల్లాబేగ్, ఏఎంసీ డైరెక్టర్ సుంకర రామారావు, ఉప సర్పంచ్ గోతం మేరీ ఝాన్సీలక్ష్మి, ఏఎంసీ గోపాలపురం చైర్మన్ గన్నమని జనార్దరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, నాయకులు ముదునూరి నాగరాజు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, వెంపాటి సురేష్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, వెంపాటి సత్యనారాయణ, తోట రామకృష్ణ, సుంకర త్రిమూర్తులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పని చేయాలి

చాగల్లు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పార్టీ శ్రేణులతో బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో తలారి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మట్టా వీరస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే మా నినాదం

- ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి
- నిడదవోలు మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: గ్రామాలను అభివృద్ధి చేయడమే తమ నినాదమని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన 56 నెలల్లో మండలాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామన్నారు. సమావేశానికి 26 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐదు శాఖల అధికారులు మాత్రమే రావడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి సైతం రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగవరం, డి.ముప్పవరం, కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి, గోపవరం గ్రామాల్లో రూ.13.70 లక్షలతో గ్రావెల్ రోడ్లు, సమిశ్రగూడెంలో రూ.6 లక్షలలో సీసీ రోడ్లు, అట్లపాడులో ఎస్సీ సామాజిక భవనం అభివృద్ధికి రూ.1.30 లక్షలు, పలు గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు పూర్తిచేసేందుకు రూ.24 లక్షలు మంజూరు చేస్తూ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వైస్ ఎంపీపీలు వడల రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ పి.శామ్యూల్, కార్యాలయ ఏఓ రత్నరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

రూ. 4.90 కోట్ల పనులకు కౌన్సిల్ ఓకే

నిడదవోలు: పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.4.90 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. అజెండాలోని 19 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదినారాయణ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి వార్డుకు రూ.10 లక్షల చొప్పున కేటాయించామన్నారు. ఎక్కడైనా అత్యవసర పనులు అవసరమైతే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. విపక్ష కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచినీటి పైపులైన్ మరమ్మతుల సమయంలో ప్రజల తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ట్యాకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం అభినందనీయమన్నారు. అయితే మంచినీటి ట్యాంకర్లకు రూ.4.90 లక్షలు ఖర్చు చేయడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై మున్సిపల్ ఏఈ హేమంత్ కుమార్ బదులిస్తూ 12 ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా అన్ని వార్డులకూ నీటి సరఫరా చేశామన్నారు. డ్రైవర్లతో పాటు అసిస్టెంట్లకు జీత భత్యాలు చెల్లించడం వల్ల ఈ మొత్తం ఖర్చయిందన్నారు.

ఆమోదించిన అంశాలివే..

ఏపీ వీధి వ్యాపారుల చట్టం ప్రకారం వీక్లీ మార్కెట్, వీధి వ్యాపారులకు మౌలిక వసతుల కల్పనకు రూ.50 లక్షలు మంజూరు చేస్తూ కౌన్సిల్ ఆమోదించింది. పట్టణ ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అయిన ఖర్చు రూ.4.90 లక్షలకు ఆమోదం తెలిపింది. అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున చెల్లించేందుకు రూ.లక్ష కేటాయింపునకు ఆమోదం తెలిపారు. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి వారపు సంత, డైలీ మార్కెట్‌లో పన్నులు వసూల హక్కులకు బహిరంగ వేలం, పత్రికా ప్రకటన ఖర్చులకు రూ.50,000 మంజూరు చేసింది. ఆరు సబ్ మెర్సిబుల్ మోటార్ల కొనుగోలుకు రూ.6 లక్షలు కేటాయించారు.

నేడు డ్వాక్రా మహిళలకు 'ఆసరా' చెక్కుల పంపిణీ

దేవరపల్లి: డ్వాక్రా మహిళలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీకి గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ రెండు మండలాల్లోని డ్వాక్రా మహిళలకు గురువారం రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేస్తారు. ఉదయం 10.30 గంటలకు గోపాలపురం మార్కెట్ యార్డులో ఆ మండలంలోని లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్ వద్ద దేవరపల్లి మండల లబ్ధిదారులకు మంత్రి చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు బుధవారం వివరించారు.